# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- మహిళలు, చిన్నారుల భద్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు.
- బీసీ సంక్షేమ వసతి గృహాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు.
- విశాఖపట్టణం ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.
- రాష్ట్ర శాసనసభ్యులు, శానస మండలి సభ్యులకు క్రీడా పోటీలను విజయవాడలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ప్రారంభించారు.

========================

`ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్` కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోక్ భవన్‌లో ఈ రోజు అరుణాచల్ ప్రదేశ్, మిజోరం రాష్ట్రాల వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అరుణాచల్ ప్రదేశ్ అందమైన పర్వతాలు, బౌద్ధ మఠాలు, సరస్సులు, సంస్కృతికి ప్రసిద్ధి చెందిన రాష్ట్రం కాగా, మిజోరం రాష్ట్రంలో భారతదేశంలోనే అత్యధిక సంఖ్యలో తెగలు ఉన్నాయని, 84.5 శాతం అటవీ విస్తీర్ణం ఉందని తెలిపారు. `ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్` కార్యక్రమం వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాల గురించి తెలుసుకోడానికి వీలు కల్పిస్తుందని గవర్నర్ పేర్కొన్నారు.

========================

విశాఖపట్టణం ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శాసనసభలో ఈ రోజు సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ... నూతన పర్యాటక పాలసీ (2024-29)తో విశాఖను యాంకర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని

వెల్లడించారు. విశాఖపట్టణం పరిసర ప్రాంతాల అభివృద్ధికి 8 వేల 650 కోట్ల రూపాయల పెట్టుబడులతో 50 ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం కింద సింహాచలం శ్రీ వరాహా లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానానికి 54 కోట్ల రూపాయలు, స్వదేశీ దర్శన్ 2.0 కింద బొర్రా గుహల అభివృద్ధికి 28 కోట్ల 87 లక్షల రూపాయలు కేటాయించి ఆయా పనులు వేగవంతం చేశామన్నారు. విశాఖపట్టణం, అమరావతి, తిరుపతి ప్రాంతాలను పర్యాటక హబ్‌లుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి దుర్గేష్ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

వైఎస్సార్ కడప జిల్లా యువతకు నైపుణ్యాలు అందించేందుకు సిద్ధమవుతున్న 'స్టార్ట్ ఆఫ్ కడప' ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సెంటర్ రాష్ట్రానికే స్ఫూర్తిగా నిలవనుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు నిర్వహించిన సమావేశంలో ఆ సెంటర్ పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పి-4 విధానంలో నిర్మిస్తున్న ఈ సెంటర్ యువ స్టార్టప్ వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్యతరహా వ్యాపారాల అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న సెంటర్ పనులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.

========================

మహిళలు, చిన్నారుల భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శాసనమండలిలో శాంతి భద్రతలపై ఈ రోజు జరిగిన చర్చ సందర్భంగా హోం మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్లే 20 నెలల్లో రాష్ట్రంలో నేరాలు 6.6 శాతం తగ్గాయని, పోక్సో కేసులు 8 శాతం, మహిళలపై హత్యలు 45 శాతం, సామూహిక అత్యాచారాలు 64 శాతం తగ్గాయని తెలిపారు. ఆడపిల్లలను ఇబ్బంది పెట్టే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామనే సందేశం ప్రజల్లోకి పంపామని గుర్తు చేశారు. గంజాయి సాగును పూర్తిగా అరికట్టామని, డ్రగ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టామని మంత్రి అనిత పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

విరామం

========================

బీసీ సంక్షేమ వసతి గృహాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. శాసనమండలిలో ఈ రోజు ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ... 891 వసతి గృహాల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు 20 కోట్ల రూపాయలతో ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ లో భాగంగా 14 కోట్ల 56 లక్షల రూపాయలతో వసతి గృహాలలో 971 మరుగుదొడ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా 10 జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలను ప్రారంభిస్తున్నామని మంత్రి సవిత తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సచివాలయంలో ఈ రోజు కొనసాగుతున్నది. దాదాపు 55 అజెండా అంశాలపై చర్చించి ఆమోదం తెలపనుంది. ఇటీవల పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న నిర్ణయాలపై, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించనున్నారు.

========================

రాష్ట్ర శాసనసభ్యులు, శానస మండలి సభ్యులకు క్రీడా పోటీలను విజయవాడలో ఈ రోజు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ... క్రీడలు శారీరక, మానసిక ఉత్సాహాన్ని ఇస్తాయని అన్నారు. ఎంఎల్ఎ, ఎంఎల్ సిలు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొనాలని స్పీకర్ కోరుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

ఐసిసి పురుషుల టీ-20 ప్రపంచ కప్ లో భాగంగా సూపర్- 8 గ్రూప్-2 విభాగంలో శ్రీలంకలోని పల్లెకెలె స్టేడియం వేదికగా ఇంగ్లాండ్, పాకిస్థాన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరగనుంది. రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభమవుతుంది.

అదే విధంగా మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ వేదికగా తొలి వన్డే క్రికెట్ మ్యాచ్‌లో భారత్ పై ఆస్ట్రేలియా మహిళా జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత మహిళ జట్టు 214 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 215 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఆస్ట్రేలియా.. 38.2 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 217 పరుగులు చేసింది.

========================

తిరుపతి జిల్లాలో నిర్మాణంలో ఉన్న రైల్వే ప్రాజెక్ట్ పనులు, శ్రీ సిటీ ఫేస్ -2, వైజాగ్ - చెన్నై కారిడార్ పైప్ లైన్ పనులు, ఇతర నిర్మాణ పనులపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. వీటిని ప్రణాళిక బద్ధంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శ్రీ సిటీ ప్రాజెక్టులకు సంబంధించిన కోర్టు కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు. జాతీయ రహదారుల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

========================

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని ఆదిత్య డిగ్రీ  కాలేజ్ లో ఈనెల 27న నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. మెగా జాబ్ మేళా గోడ పత్రికను ఆమె ఈ రోజు ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ఈ జాబ్ మేళా  ద్వారా సుమారు 21 ప్రముఖ కంపెనీలతో పాటు.. మరికొన్ని ఇతర కంపెనీలలో 2 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు.

========================
========================